కామెడీ కథ

**కె.రాజేశ్వరి**

**చాదస్తపు మొగుడు చెబితే వినడు కొడితే ఏడుస్తాడంటారు. అలా ఉంది మా వారి వరస. ఇంట్లోకి ఏదన్నా కావాలని పిల్లలు, నేను అడిగితే (అదెంత అవసరమైన వస్తువైనా ఖరీదు తక్కువదైనా సరే) అదేదో సినిమాలో కోటా శ్రీనివాసరావులా అనర్గళంగా ఓ అరగంట సేపు అలుపూసొలుపూ లేకుండా పొదుపుమీద స్పీచిచ్చి మమ్మల్ని నోళ్లు మూయిస్తారు. అదే ఈయనగారైతే ఎదుటివాళ్ళు ఏదన్నా కొన్నారని తెలిస్తే, సారీ! చూస్తే..వెంటనే అప్పు చేసైనా, అదెంత ఖరీదైన వస్తువైనా సరే కొనేస్తారు.**

# పాపం శ్రీవారు

అది కూడా మామూలుగా కొనరు. వాళ్ళు కొన్న వస్తువు తన దగ్గర లేనిదైతే వాళ్ళు కావాలనే ఆ వస్తువు తనకి చూపించి తనని చిన్నచూపు చూస్తున్నట్లుగా తెగ ఫీలైపోయి వాళ్ళని నానా మాటలని ఆ వస్తువు కొనేవరకు పిచ్చెక్కినట్లే ఉంటారు. ఈయనగారి వరస చూస్తుంటే చాదస్తమో..వెర్రో..కొత్త రకం పిచ్చో, పెళ్లై ఎనిమిదేళ్లైనా ఇప్పటికి అర్థం కాదు నాకు. ఒక్కోసారి అనిపిస్తుంటుంది. ఫాల్స్ ప్రిస్టేజ్‌కి మారుపేరు మా వారేమోనని.

ఓసారేమైందంటే పిల్లలు పిక్చర్‌కి వెళ్దామని గొడవ చేస్తుంటే వాళ్ళని మాటలతో మాయచేసి (సినిమాకైతే ఖర్చవుతుందని) దగ్గర్లోనే ఉన్న పార్కుకి నడిపించి మరీ తీసుకెళ్ళారు. పల్లీలు, ఐస్‌క్రీంలతో వాళ్ళని మభ్యపెట్టి ఇంటికి తిరిగివస్తుంటే ఆయన కొలీగ్ సుబ్బారావు భార్యా, పిల్లలతో స్కూటర్ మీద వెళ్తూ మమ్మల్ని చూసి స్కూటరాపి పలకరించి వెళ్ళాడు.

ఇక ఆ రోజుకి ఆ సుబ్బారావు ఐపోయాడనుకోండి. అఫ్‌కోర్స్..మాటల్లోనే సుమండి.

''చూశావా..చూశావా..'నేను చూడు ఎంచక్కా స్కూటరెక్కి తిరుగుతున్నాను. నీ బోడి మొహానికి అది కూడా లేదు' అని నన్ను ఎగతాళి చేయటానికేగా వాడలా స్కూటరాపి మరీ పళ్ళికిలిస్తూ పలకరించాడు. బోడి స్కూటరు. వీడికేనా ఉంది. వీడికంటే నాకేం తక్కువని. రేపే లోన్‌కి అప్లై చేసి వీడికంటే ఖరీదైనది, లేటెస్టుది కొంటాను. అప్పుడు కానీ నా తడాఖా ఏంటో తెలీదు'' అంటూ ఇంటికి చేరేవరకు దారి పొడుగునా ఆ సుబ్బారావుని నానా మాటలు అంటూ కుప్పిగంతులకి ఓ మోస్తరు ఎక్కువగా చిందులేశారు.

''ఇప్పుడెందుకండీ మనకి స్కూటరు. మీకెటూ ఆఫీస్ బస్ వస్తుంది కదా. పిల్లలు స్కూలుకి రిక్షాలో వెళ్తారాయె. లోన్ తీసుకుని మరీ అంత ఖరీదైన స్కూటర్ కొనాల్సిన అవసరమేముందండి. మళ్ళీ లోన్ తీర్చాలంటే ఎంత కష్టమో ఆలోచించండి. పైగా పెట్రోల్ ధర కూడా మండి పోతోంది'' అంటే-

''నువ్వు మాట్లాడకు. ఇది నా ప్రిస్టేజ్‌కి సంబంధించింది'' అంటూ పాతాళభైరవిలో ఎస్వీ రంగారావులా గర్జించి నా నోరు మూయించారు.

పెళ్ళాం పిల్లల్ని సినిమాకి తీసుకెళ్ళటానికి పిసినారితనం చూపించిన పెద్దమనిషి వేలకి వేలు పోసి స్కూటర్ కొనాలని పంతం పడుతుంటే ఈయనగార్ని ఎలా అర్థం చేసుకోవాలో తెలీక తలపట్టుక్కూర్చున్నాను.

అనుకున్నట్లే నెల తిరక్కుండా లోన్‌లో స్కూటర్ కొని వద్దన్నా వినకుండా మొదటిరోజే సుబ్బారావుగారింటికి మమ్మల్నందర్నీ ఎక్కించుకొని వెళ్ళి- 'ఆ ఒక్కటి అడక్కు' సినిమాలో 'ఆఫ్టర్ ఒన్ ఇయర్' అంటూ రాజేంద్రప్రసాద్‌లా కాలరెగరేసినంత ఫోజు కొట్టారు.

నిజం చెప్పద్దూ...ఆయన్నలా చూస్తుంటే ఒళ్ళు మండిపోయిందనుకోండి.

ఓసారి మావారి ఫ్రెండ్ ప్రసాద్‌గారు, వాళ్ళావిడ పుట్టింటికెళ్ళిందని, ఆదివారం వాళ్ళింటికి రమ్మని పిలిచారట. తీరా ఈయనగారు వెళ్ళి కాలింగ్ బెల్ కొడితే అప్పుడు నిద్రలేచి తలుపు తీసి ''కూర్చోరా. త్వరగా బ్రష్ చేసుకని స్నానం చేసి వస్తాను. ఈలోగా టీవీ చూడు'' అంటూ టీ.వి. ఆన్ చేసి బాత్ రూంలో దూరారట.

అదిగోండి. అది కూడా తప్పైపోయింది మావారి దృష్టిలో. ఎలాగంటారా..మాది బ్లాకండ్ వైట్ ఐతే వాళ్ళది కలర్ టీవీ మరి.

ఇంటికొచ్చాక మొదలెట్టారు శోకం.

''బోడి..వాడికే కలర్ టీవీ ఉందని ఎంత పొగరో..రోజూ మనింట్లో టీవీ చూడనట్లు టీవీ చూడు టీవీ చూడు అంటూ పెద్ద ఫోజు. వీడు..ఇంతోటి కలర్ టీవీ మనకి లేదనేగా..వాడికంటే మనకేం తక్కువా. మళ్ళీ ఆదివారానికల్లా కలర్ టీవీ కొన్ని వాణ్ణి మనింటికి పిలుస్తా చూడు..''

అనుక్నుట్లే వారం తిరక్కుండా ఇన్‌స్టాల్‌మెంట్లో కలర్ టీవీ కొని ప్రసాద్‌గార్ని పేకాట పేరుతో ఆదివారం నాడు మా ఇంటికి పిలిచి దాన్ని చూపించాక కాని శాంతించ లేదు. ఇలాగే ఫ్రిజ్, ఫోను కూడా మా ఇంట్లో వెలిశాయి. మా ఇంట్లో ఏ వస్తువు వచ్చినా దాని ముందొక ఫ్లాష్‌బ్యాక్ స్టోరీ ఉండాల్సిందే.


ఈ రకంగా పెళ్లైన దగ్గర్నుండీ లోన్లు, ఇన్‌స్టాల్‌మెంట్లు కట్టటంతోనే జీతమంతా సరిపోతుంది. పాత లోన్లు తీరిపోతుందనుకోగానే మళ్ళీ మరోదానికి టెండరు. అదే ఇంట్లో పిల్లలకి కాని, నాక్కాని బట్టలు కొనాలన్నా పుట్టిన రోజుకి పార్టీ ఇవ్వాలన్నా ఎక్కడలేని పీనాసితనం చూపిస్తారు. అంతెందుకు..''పిల్లలతో ఇబ్బందిగా ఉంది మిక్సీ కొందామండి..'' అన్నా వినలేదు. చివరికి ఈయనతో విసిగిపోయి పండక్కి బట్టలు కొనుక్కోమని అమ్మావాళ్ళిచ్చిన డబ్బుల్తో మిక్సీ కొన్నాను.

ఒక్కోసారి ఈయనగారి పొదుపు చూస్తుంటే జుట్టు పీక్కోవాలనిపిస్తుంది. అలా చేస్తే అసలే పిల్లలు పుట్టాక సగమైపోయిన జడ కాస్తా ఇంకాస్త చిక్కి ఎక్కడ పిలకలా ఐపోతుందోనని భయమేసి ఆ ప్రయత్నం మానుకుంటూ ఉంటాను.

మావారి ఖర్మకొద్దో, మా అదృష్టంకొద్దో ఈమధ్య మా ఎదిరింట్లోకి ఓ బ్యాంకు మేనేజర్ గారి ఫ్యామిలీ అద్దెకి వచ్చారు. ఎందుకనో అంత హోదాలో ఉండి కూడా వాళ్ళు కారు కొనుక్కోలేదు. లేకపోతే ఈపాటికి మావారు పొలమో పుట్రో అమ్మైనా దానిక్కూడా టెండరు పెట్టేసేవారే.

వాళ్ళొచ్చిన వారం రోజులకనుకుంటా..ఓ రోజు సాయంత్రం ఇంటికి రావటంతోనే ఉరుములేని పిడుగులా విరుచుకుపడ్డారు.

''అబ్బా..ఆయనగారికే పెళ్ళాం ఉన్నట్లు లోకంలో ఇంకెవరికి లేనట్లు వెధవ ఫోజులు..వాడూను..ఆయనగారు వెళ్ళేటప్పుడు



బయటకొచ్చి సందుమలుపు తిరిగేదాకా టాటా చెప్పటం..మళ్ళీ సాయంత్రం ఆయనగారు వచ్చేవరకు గేటుపట్టుకు వేళ్లాడటం..అబ్బ..ఇంతోటి మొగుడు పెళ్ళాలు లోకంలో ఎక్కడా లేనట్లు..వీళ్ళు..వీళ్ళ ఫోజులూను..ఉదయం చూడాలి. పెళ్ళాం టాటా చెబుతుంటే ఎంత ఎగతాళిగా నావైపు చూసి పళ్ళికిలించాడని..'' అలుపు తీర్చుకోటానికి ఆగారు.

సీన్ అర్థమైపోయింది నాకు. మేనేజర్‌గారు బ్యాంక్‌కి వెళ్ళబోయే టైంలో ఈయనగారు బయటికి రావటం చూసి పలకరింపుగా నవ్వుంటారు.

''ఐనా వాళ్ళని కాదు ముందు నిన్ననాలి. పెళ్ళైన కొత్తల్లో ఆఫీస్‌కి వెళ్ళేవరకు నా వెంటే ఉండేదానివి. మళ్ళీ నేను ఎప్పుడెప్పుడు వస్తానా..అని నాకోసం ఎదురు చూస్తూ వాకిట్లో నిలబడేదానివి. ఇప్పుడేమైంది నీకు..? నామీద ప్రేమ తగ్గిపోతుందిలా ఉంది.

పెళ్ళైన కొత్తల్లో ఎంచక్కా స్నానం చేసి కాఫీ కప్పుతో నవ్వుతూ వచ్చి నిద్ర లేపేదానివి. ఇప్పుడు చూడు. ఎప్పుడు చూసినా వేలిముడేసిన జుట్టుతో ఎగదోపిన కుచ్చిళ్ళతో అప్పలమ్మలా దర్శనమిస్తావ్. మొగుడి ముందేమో అప్పలమ్మ అవతారం. అదే బయటకెళ్ళేటప్పుడు అప్సరసల్లా అలంకరించుకుంటారు. మీ ఆడాళ్ళంతా ఇంతే. అసలు. ఆడదంటే ఎలా ఉండాలో ఎదిరింటావిణ్ణి చూసి నేర్చుకో..''

ఈయనగారి వాగ్ధాటి చూసి అర్థం పర్థం లేని ఆ మాటలకి పిచ్చికోపం వచ్చింది. కానీ పిలక సంగతి గుర్తొచ్చి ఆ ప్రయత్నం మానుకున్నాను.

ఈ మగాళ్ళంతా తక్కువైనట్టు. ఇంట్లో ఉన్నంతసేపు మాసినగడ్డం, గళ్ళలుంగీ బనీన్లతో పాలేర్లలాగో, బఫూన్లలాగో దర్శనమిస్తారు. అదే బయటకెళ్ళేటప్పుడు టింగురంగా అంటూ టక్కు గిక్కు చేసి పెద్ద ఫోజు కొడతారు. మమ్మల్ని వేలెత్తి చూపే ముందు మీ అవతారం సంగతి చూసుకోండి...పైకి అనాలని ఉన్నా అనలేక వూరుకున్నా.

''ఏంటి..అలా చూస్తావ్. చెప్పిందేమన్నా అర్థమైందా..?''

ఒళ్ళు మండిపోయింది నాకు.

''ఒకళ్ళని చూసి నేర్చుకోవాల్సిన అవసరం నాకేం లేదు. వాళ్ళాయన బ్యాంకు మేనేజరు. ఇంట్లో పనివాళ్ళున్నారు. పైగా వాళ్ళ పిల్లలు పెద్ద పిల్లలు కాబట్టి ఎవరి పన్లు వాళ్ళు చేసుకుంటారు. ఆమెకి పనేం ఉండదు. కనుక ఎప్పుడూ నీట్‌గా తయారై ఉండొచ్చు.. నాకలా కాదే. ఇంట్లో పనంతా నేనే చేయాలి. పిల్లలు చిన్నవాళ్ళు కాబట్టి స్నానాలు చేయించటం, స్కూల్ యూనిఫారం దగ్గర్నుండి టై, బెల్టు, షూ అన్నీ వేయాలి. తిండి కూడా నేనే

తినిపించాలి. ఆమెలా లేచీ లేవటంతోనే ముస్తాబై కూర్చోవాలంటే నాకెలా కుదుర్తుంది...? ఐనా...ఇప్పుడు మీకేం తక్కువ చేశానని. మీరు ఆఫీస్‌కి వెళ్ళేటప్పుడు పిల్లలకి స్కూల్‌కి టైమవుతుందని వాళ్ళని రెడీ చేసి లంచ్ బాక్సులు సర్దే హడావుడిలో ఉంటాను. సాయంత్రం మీరొచ్చేసరికి పిల్లలొచ్చి ఉంటారు కాబట్టి వాళ్ళకి స్నానాలు చేయిస్తూనో, ఏదైనా తినిపిస్తూనో ఉంటాను. అంత మాత్రానికే మీమీద ప్రేమ తగ్గిపోయినట్లా..?'' కోపంగా అన్నాను.

''ఏమో అదంతా నాకు తెలియదు. ఉదయం ఆయన పెళ్ళాం పక్కనున్నదనేగా పెద్ద ఫోజు పెట్టి మరీ నన్ను చూసి నవ్వాడు. నాకెంత తలకొట్టేసినట్లైందో నీకేం తెలుసు. రేపటి నుండి నువ్వు కూడా నేను ఆఫీస్‌కి వెళ్ళేటప్పుడు వచ్చేటప్పుడు నా పక్కనే ఉండాలి.''

పిచ్చి కుదిరింది. రోకలి తలకి చుట్టమన్నాడట వెనకటికెవరో. అలా ఉంది ఈయన వరస.

''ఎలా కుదుర్తుందండి. ఉదయాన్నే స్నానం చేసి ముస్తాబై కూర్చోటానికి ఇంటి పనంతా ఎవరు చేస్తారు?''

''ఏమో. అదంతా నాకు తెలీదు. కావాలంటే నువు కూడా ఓ పనిమనిషిని పెట్టుకో. ఐనా మనకేం తక్కువని..?''

ఇంతకుముందోసారి ఒంట్లో బాగోక పనిమనిషిని పెట్టుకుంటే ఎందుకు నలుగురికోసం పనిమనిషి. డబ్బులు దండగ.. అంటూ మానిపించేదాకా నా ప్రాణం తీసిన నా మొగుడేనా ఇలా మాట్లాడుతోంది? ఇది కలా నిజమా? అని ఆశ్చర్యపోయాను కాసేపు.

ప్రతిదానికి ఎదుటివాళ్ళతో పోల్చుకోవటం. అవతలి వాళ్ళు 'అమ్మా' అన్నా 'నీయమ్మా' అన్నట్లు ఫీలయిపోవటం..ఉహు..ఇక లాభం లేదు. ఈ తలతిక్క మనిషికి ఎలాగైనా బుద్ధి చెప్పాలి అనుకొని ఇప్పుడే వస్తానంటూ ఆవేశంగా లేచి చీరకుచ్చిళ్ళు సరిచేసుకుని చెప్పులేసుకుని నాలుగిళ్ళవతలున్న పంకజం గారింటికి వెళ్ళాను. వాళ్ళ పనిమనిషి తాయారమ్మని చూడగానే ప్రాణం లేచి వచ్చినట్లైంది.

తాయారమ్మతో మాక్కూడా ఓ పని మనిషిని చూడమని ఏ పని చెప్పినా చేసేలా ఉండాలని, రేపు ఉదయాని కల్లా తప్పకుండా తీసుకురావాలని చెప్పాను.

''ఎవరో ఎందుకమ్మా. మా ఆడ బిడ్డ ఇంట్లో ఉంటే తోచటం లేదు. ఏదైనా పని చూపించమని గొడవ పెడుతుంది. రేపు ఉదయాన్నే నేను పన్లోకి వచ్చేటప్పుడు నాతోపాటు తీసుకొస్తాలే'' అంది.

అనుకున్నట్లే తాయారమ్మ లక్ష్మిని వెంటబెట్టుకు వచ్చింది. లక్ష్మి ఎంత అడిగినా ఇవ్వాలన్నంత కసిగా ఉంది నాకు. అంట్లు, బట్టలు, పిల్లలకి స్నానాలు చేయించటం, వంట పని అన్నిటికి కలిపి ఐదొందలు అడిగింది.

మాట్లాడకుండా ఒప్పేసుకున్నాను. లక్ష్మి వచ్చిన దగ్గర్నుండి నా టైంటేబుల్ మారిపోయింది. ఉదయాన్నే లేవటం, చక్కగా స్నానం చేసి అందంగా సింగారించుకొని లక్ష్మి కలిపి ఇచ్చిన కాఫీ కప్పుతో కొత్త పెళ్ళికూతుర్లా వయ్యారాలు పోతూ ఆయనగార్ని నిద్రలేపటం, తర్వాత పిల్లల్ని లేపి వాళ్ళచేత హోం వర్క్ చేయించటం, వాళ్ళందరి స్నానాలు కాగానే అందరం డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చుని లక్ష్మి వడ్డిస్తుంటే టిఫిన్ తినటం...ఈయనగారు ఆఫీస్‌కి బయల్దేరేటప్పుడు పక్కనే వెళ్ళి సందు మలుపు తిరిగే వరకు టాటా చెప్పటం.. (ఆ టైంలో నా వైపు చూడకుండా ఛాతీ సైజు ఐదంగుళాలు పెంచి ఎదురింటివైపు దొంగచూపులు చూస్తారనుకోండి. అది వేరే విషయం) మళ్ళీ సాయంత్రం ఐదింటికల్లా ఈయనగారికి స్వాగతం చెప్పటం.

నిజం చెప్పొద్దూ. కావాల్సినంత రెస్టు దొరికేసరికి నాకు హాయిగానే ఉంది.

గిర్రున నెల తిరిగి ఫస్టు తారీఖు రానే వచ్చింది. అప్పుడు చూడాలి మావారి వరస. పాలవాడికి డబ్బులివ్వబోయి ''ఏమిటి? పాలరేటు పెంచాడా'' అన్నారు.

''లేదండి. పాపం లక్ష్మి ఇంటెడు చాకిరీ చేస్తుంది కదా. పొద్దున్నే కాసిని కాఫీ నీళ్లైనా తాక్కుండా ఎలానండి..అందుకని రోజూ పాలు ఎక్కువ తీసుకుంటున్నాను''

చిల్లరకొట్టు ఖాతా పుస్తకం చూసి ''ఏమిటి ఈసారి నాలుగొందలు ఎక్కువ వచ్చింది. కూడికలేమైనా తప్పేశాడా?'' అంటూ మళ్ళీ కూడటం మొదలుపెట్టగానే.

''అదేం లేదండి. ఇంటి పనంతా చేయించుకొని ఒక్కముద్ద అన్నం కూడా పెట్టమని తెలిస్తే నలుగురూ ఏమనుకుంటారు. అందుకని మనతో పాటు ఓ పూట టిఫిను, భోజనం కూడా చేస్తుంది కదా లక్ష్మి. సరుకులు కాస్త ఎక్కువ తెప్పించాల్సొచ్చింది. ఐనా మనకేం తక్కువని..పనిమనిషికి ఓ పూట తిండి కూడా పెట్ట

## కొసమెరుపు

**తారల రాకపోకలు, వారి వ్యవహారం మీడియాకి కావాల్సినంత మేతను అందిస్తుంది. డేర్ అండ్ డాషింగ్ లేడీ మల్లికా షెరావత్ ఇప్పుడు వార్తల్లో తార అయింది. అమెరికన్ న్యూస్ ఛానెల్ సిఎన్ఎన్ యాంకర్ రిజ్‌ఖాన్ తరచూ ఆమెని కలిసి వెళ్లడమే అందుకు కారణంగా భావిస్తున్నారు. 'బాచ్‌కె రెహ్నా రె బాబా' సినిమా షూటింగ్‌లో ఉన్న మల్లికను ఖాన్ కలిసి వెళ్లడం ఇండస్ట్రీలో చర్చనీయాంశం అయింది. ఇదిలా ఉంటే 'ఏదో వార్త కోసం ఆయన వచ్చి వెళ్లారు' అని ఆమె సన్నిహితుడు వ్యాఖ్యానించాడు. ఈ సినిమా షూటింగ్ అనంతరం మల్లిక రిజ్‌కి డిన్నర్ కూడా ఇవ్వడం కొసమెరుపు.**



లేమా..?'' మనకేం తక్కువ అన్నమాట సాగదీసి ఒత్తిపలుకుతూ ఓరగా ఆయనగార్ని చూస్తూ అన్నాను.

పాలవాడికి, రేషన్ షాపులో కట్టాల్సినవి, ఫోన్, కరెంట్, కేబుల్.. ఇలా అన్నిటికి డబ్బులిచ్చి మిగతావి బీరువాలో పెట్టబోతుంటే ''ఉండండి..ఇంకో ఐదొందలు కావాలి'' అన్నాను.

''ఎందుకు?''

''ఎందుకేమిటండీ..లక్ష్మికి నెల జీతం ఇవ్వద్దూ..''

''ఏమిటి..నెలకి ఐదొందలా..?'' కళ్ళు తేలేశారు.

''మరి. ఇంటెడు పని వూరికే చేస్తారా..తాయారమ్మ చుట్టం కాబట్టి ఐదొందలకి ఒప్పుకుంది. అదే ఇంకోళ్ళైతే ఇంకా ఎక్కువే అడుగుతారు. అయినా మనకేమిటండీ..నెలకి బోడి ఐదొందలేగా..''

ఆయనగారి ఆముదం తాగిన ఫేస్ చూసి లోలోపల ఎంత ఆనందపడ్డానో.

ఏడవలేక నవ్వలేక అతి కష్టంగా ఐదొందలిచ్చారు.

శ్రావణమాసం వస్తుంది. నోములు, పెళ్ళిళ్ళు, పేరంటాలని ఎవరో ఒకరు పిలుస్తుంటారు. మంచి చీరలు వేళ్ళమీద లెక్కపెట్టేవన్ని కూడా లేవు. ఆలోచించి ఆలోచించి ఆయనగారు దాచిన డబ్బుల్లో ఓ ఐదొందలు పెట్టి ఓ మంచి చీర కొనుక్కొచ్చాను.

సాయంత్రం శ్రీవారు ఇంటికి రాగానే చీర చేతికిచ్చి ''ఎలా ఉందండి'' అన్నాను.

''ఎక్కడిది..?'' అనుమానంగా చూస్తూ అడిగారు.

వెంటనే నేను శ్రీవారి వెనక నిలబడి నా రెండు చేతులు ఆయన మెళ్ళో హారంలా వేసి తలమీద నా గడ్డం ఆన్చి ముద్దుముద్దుగా చెప్పాను.

''ఉదయం మీరలా ఆఫీస్‌కి వెళ్ళగానే లావణ్యగారు..అదే ఎదురింటి బ్యాంకు మేనేజరు భార్య పిలిచారు. ఏమిటోనని వెళ్తే వాళ్ళింటికి తెలిసిన వాళ్ళెవరో చీరలు అమ్మటానికని తెచ్చారట. నేను కూడా తీసుకుంటానేమోనని పిలిచారట. చీరలు చూసి లేచి వస్తుంటే అదేమిటండీ ఒక్కటి కూడా తీసుకోలేదు. మీవారేమన్నా అంటారనా..? అన్నారు. 'అబ్బే అదేం లేదండి' అన్నాను. 'మరి నచ్చలేదా ఏమిటి?' అంటే- 'బాగానే ఉన్నాయండి..' 'మరింకేమిటండి..నచ్చితే తీసుకోండి. డబ్బులు కూడా ఇప్పుడిచ్చే పనిలేదు. ఉంటే సగం ఇవ్వచ్చు. లేదంటే మళ్ళీ నెల్లో ఇవ్వచ్చు' అన్నారామె.

ఇక లాభం లేదనుకొని ఈ చీర తీసుకొని ఐదొందల కోసం మళ్ళీ నెలదాకా ఎందుకండీ...ఇప్పుడే తెచ్చిస్తానని చెప్పి మీరు దాచిన డబ్బుల్లోవి ఓ ఐదొందలు తీసిచ్చాను. ఏమిటో ఆవిడగారి ముందు తేలికవటం ఇష్టంలేక ఈ చీర కొన్నానే కానీ మీకు తెలియకుండా ఇంత రేటు పెట్టి కొన్నందుకు ఉదయం నుండి ఎంత బాధపడిపోతున్నానో..'' అదేదో సినిమాలో శ్రీలక్ష్మిలా ఫేస్ పెట్టాను.

''మంచి పని చేశావ్. మన పరువు నిలబెట్టావ్'' అంటూ మెచ్చుకున్నారు.

ఓసారి వాళ్ళ ఫ్రెండెవరో ఈయనగారి ముందు సెల్‌ఫోన్‌లో మాట్లాడారట. ఈయనకి తిక్కరేగి అది కొనాలని వూగారు.

వెంటనే నేను బీరువాలో నుండి డబ్బులు తీసుకొని నగల షాపుకెళ్ళి పాపకి, నాకు వెండి పట్టీలు కొనుక్కొచ్చాను. లావణ్యగారు తోడురమ్మంటే నగల షాపుకి వెళ్ళానని ''ఏమిటండీ పట్టీలు పెట్టుకోరు. మీ పాదాలకి ఎంత అందంగా ఉంటాయో''నని వద్దన్నా వినకుండా ఆవిడే సెలక్టు చేసి డబ్బులు కూడా ఇచ్చారని, ఇంటికి రాగానే ఆలస్యమైతే బాగోదని మీకు చెప్పకుండా మొదటిసారిగా బీరువాలో నుండి డబ్బులు తీసి ఇచ్చానని తెగ బాధపడిపోతున్నట్లుగా అందంగా ఓ అబద్ధం చెప్పాను. దాంతో కొన్నాళ్ళ పాటు సెల్‌ఫోన్ పోస్ట్‌పోన్.

మరోసారి..వాళ్ళ ఆఫీసులో ఎవరో సీనియర్ స్టాఫ్ కంప్యూటర్ కొన్నారట. మనకేం తక్కువ. మనం కూడా కొందాం అని తెగ ఆవేశపడిపోయారు.

వాళ్ళ పిల్లలు డిగ్రీలు చదువుతున్నారు కాబట్టి అవసరమై కొనుక్కున్నారు. మన కెందుకండి. పిల్లలు చిన్నవాళ్ళు కదా అంటే అలిగి నామీద ఇంతెత్తున ఎగిరారు.

పిల్లలు వంద రూపాయలు పెట్టి టెడ్డీబేర్ బొమ్మ కొనివ్వమంటే లక్షా తొంభై కబుర్లు చెప్పి కొనకుండా తప్పించుకొనే ఈయన వేలకి వేలు పోసి కంప్యూటర్ కొంటారా? ఉండండి మీ తిక్క కుదురుస్తాను అనుకుంటూ ఆయనగారు ఆఫీస్‌కి వెళ్ళగానే రెడీ అయి నగలషాపుకి వెళ్ళి పాపకి బంగారు మాటీలు, పాపిట బొట్టు, జూకాలు తెచ్చాను. మొత్తం తొమ్మిది వేలయాయి.

''ఏమండీ..ఉదయం లావణ్యగారు మనింటికి వచ్చారు. ఏవో మాటల మధ్యలో పాపకి నగలేం చేయించారండి? అన్నారు. నాకు సిగ్గుతో ప్రాణం పోయినంత పనైందనుకోండి. ఏవో చిన్న చిన్నవి చేయించామండి అని అబద్ధమాడాను. రేపెప్పుడైనా చూపించమని అడిగితే పరువు పోతుందని ఈ నగలు తెచ్చానండి. ఎంతా.. తొమ్మిది వేలే. నాలుగు వేలు కట్టేశాను. మిగతావి ఇన్‌స్టాల్‌మెంట్లో కట్టొచ్చు'' అన్నాను.

పెనం మీద డబుల్ రోస్ట్ అయిన దోసెలా ఉన్న ఆయనగారి ఫేస్ చూసి తెగ ముచ్చటపడిపోయాననుకోండి.

ఇదే విధంగా పాపం ఇంట్లో నుండి బయటకు రాని (ఎప్పుడో తప్ప) లావణ్యగారి పేరు అడ్డం పెట్టుకొని ఎప్పటికప్పుడు అందంగా అబద్దాలు చెప్తూ ఈయనగారి కోరికలకి కళ్ళేలు వేస్తూ నెమ్మదిగా నాకు దుద్దులు, నెక్లెస్, పట్టుచీరలు, పాపకి గాజులు, గొలుసు, పిల్లలకి బట్టలు, ఇంట్లోకి వెట్ గ్రైండర్.. ఇలా ఒక్కటొక్కటిగా మా కోరికలు తీర్చుకుంటున్నాము. మెల్లగా పిల్లల పేర్న ఫిక్సడ్ డిపాజిట్లు చేయాలని నిర్ణయించుకున్నాను. ఈయనగారికి కంటిముందు ఎప్పుడూ అప్పులే తప్ప డబ్బు కనిపించకూడదు. అప్పుడు కాని దారికి రారు.

అందుకే ఈయనగారి రూట్లోకే వచ్చి నేను చేసే అప్పులు చూసి పైకి ఏమీ అనలేక (ఏమన్నా అంటే మనకేం తక్కువండి..అనే ఆయుధం ఉంది కదా..) తన గొంతెమ్మ కోర్కెలకి దాదాపు ఫుల్‌స్టాప్ పెట్టేశారు. పాపం శ్రీవారు.



## ఆనందం

**కొన్ని కొన్ని ఆనందాలు స్వయంగా అనుభవిస్తే గానీ తెలియదు. బాబీడియోల్ ఇప్పుడు ఇలాంటి ఆనందంలోనే ఉన్నాడు. మళ్ళీ తండ్రి అయిన బాబీ భార్య తాన్యాతో కలిసి తన ఆనందాన్ని పంచుకుంటున్నాడు. 'ఆస్పత్రిలో ఉన్న నా భార్య, పిల్లల్ని చూసి వస్తున్నాను. ఎంత బిజీగా ఉన్నా కుటుంబం కోసం టైం కేటాయించడం ఎంతో అవసరం. ఆ ఆనందం ముందు ఎంత డబ్బు వచ్చినా వేస్టే' అంటున్నాడు బాబీ.**